పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

- ఎంపీ, తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ


పాదయాత్రలో స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

బీచ్‌రోడ్డు : పేదల సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. 39వ రోజు బుధవారం పాదయాత్రను జీవీఎంసీ 22వ వార్డులో ఆయన కొనసాగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన పేదల సంక్షేమమే ధ్యేయంగా కొనసాగుతోందన్నారు. అటువంటి వ్యక్తి పరిపాలన మరోసారి రాష్ట్రానికి అవసరమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

19వ వార్డులో కొనసాగిన ఎంపీ పాదయాత్ర

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ 'జనం కోసం.. జనంలో' పేరిట చేపట్టిన పాదయాత్ర బుధవారం 19వ వార్డులో కొనసాగింది. ప్రజల నీరాజనాలు అందుకుంటూ తూర్పు నియోజకవర్గంలో విస్తృతంగా యాత్ర కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ 39వ రోజు 19వ వార్డులోని పెదజాలరిపేటలో వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పాలన మునుపెన్నడూ రాష్ట్రంలో లేదన్నారు. ప్రజాకర్షక పథకాలతో ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని సీఎం జగన్ చేరువ చేశారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి సంక్షేమ


పాదయాత్రలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

పాలనకు బ్రహ్మరథం పట్టాలని కోరారు. జాలరిపేట వాసుల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ వార్డులో మౌలిక వసతులు

- కోట్ల రూపాయలతో చకచకా పనులు
- ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ
- 13వ వార్డులో రూ.2.45 కోట్లతో పనులకు శంకుస్థాపన


లక్ష్మీనగర్‌లో గెడ్డ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ, కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా జీవీఎంసీ 13వ వార్డులో రూ 2.45 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న పనులకు వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతతో కలసి, బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో కోట్ల రూపాయల వ్యయంతో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్పొరేటర్ సునీత మాట్లాడుతూ ప్రస్తుతం వార్డులో రూ 2.45 కోట్ల నిధులతో గెడ్డల ఆధునీకరణ కోసం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. లక్ష్మీనగర్‌లో రూ 1.47 కోట్లు, ఆపరేషన్ కాలనీలో రూ. 98 లక్షలతో గెడ్డలు ఆధునికీకరిస్తున్నట్లు చెప్పారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ వర్క్స్ వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కెల్ల సత్యనారాయణ, స్థానిక పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

భక్తి, జ్ఞాన మార్గాల ద్వారానే భగవదనుగ్రహం

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ
- ముగిసిన హనుమద్వైభవ ప్రవచనాలు


కీర్తనలు ఆలపిస్తున్న చైతన్య బ్రదర్స్


హనుమద్వైభవాన్ని వివరిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

ఎంవీపీకాలనీ: భక్తి, జ్ఞాన మార్గాల ద్వారా మాత్రమే భగవదనుగ్రహాన్ని పొందగలమని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో నిర్వహిస్తున్న హనుమద్వైభవ ప్రవచనాల్లో భాగంగా ఆయన అనుగ్రహ భాషణం చేశారు. ఆంజనేయుడిని ఆరాధిస్తే సకల దేవతలను ఆరాధించినట్లే అన్నారు. మార్గశిర మాసంలో హనుమారాధన శుభప్రదమన్నారు. పలు అధ్యాత్మిక అంశాలపై భక్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా చైతన్య బ్రదర్స్ భక్తి సంగీత విభావరి అలరించింది. ప్రవచనాల అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖ శర్మ ఆశీస్సులు తీసుకున్నారు. కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రవచనాలు బుధవారంతో ముగిశాయి.

క్లుప్తంగా

పిల్లలకు పెద్దలపై గౌరవం అవసరం


తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: పిల్లలకు పెద్దలు, గురువులపై గౌరవం ఉండాలని మేగా వేదాంత సమితి ఆశారం బాపు శిష్యులు శరత్‌చంద్ర ప్రభు, పరమేశ్వర ప్రభు సూచించారు. ఆరిలోవ భారతి స్కూల్‌లో బుధవారం తల్లిదండ్రుల పాద పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రుల పాదాలకు పూజ చేశారు. అనంతరం బాపు శిష్యులు మాట్లాడుతూ తల్లిదండ్రులను దైవంతో సమానంగా భావించాలన్నారు. ఇటీవల కాలంలో కొందరు తల్లిదండ్రులను అనాథ శరణాలయాల్లో విడిచిపెడుతున్నారని... ఇది చాలా బాధాకరమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో మంచి మార్గంలో నడవాలని సూచించారు. పాఠశాల కరెస్పాండెంట్ ఎం.వి.రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్టురోగులకు వస్తువుల వితరణ


కుష్టు రోగులకు వస్తువులు పంపిణీ చేస్తున్న డీపీఎంవోలు రామకృష్ణ, ప్రసాదరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా కుష్టునివారణాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ఆదేశాల మేరకు బుధవారం 'స్పర్శ' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడవివరంలోని ఏఎంజీ లెప్రసీ కాలనీలో 53 మంది కుష్టు వ్యాధి గ్రస్తులకు డిప్యూటీ పారా మెడికల్ అధికారులు .కె.ప్రసాద రావు,పి.రామకృష్ణ బియ్యం, పప్పు, పండ్లు,సెల్ఫ్ కేర్ కిట్స్, మందులు పంపిణీ చేశారు. వ్యాధి గ్రస్తులు తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలను, మందులు వాడడం గురించి రోగులకు వివరించారు. డీపీఎంవో పి.రామకృష్ణ, ప్రసాదరావు ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

లలితాదేవికి అష్టోత్తర శతకలశాభిషేకం


లలితాపీఠంలో నిర్వహిస్తున్న శతకలశాభిషేకం

ఏయూక్యాంపస్: స్థానిక శ్రీ లలితాసుందరేశ్వర పీఠం వార్షికోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీ లలితా త్రిపుర సుందరి అమ్మవారికి అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ చక్ర ఆవరణార్చన నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారి అభిషేక సేవలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6, అంజయ్యనగర్, రాజీవ్ పార్కు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సెక్టార్ – 6లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలంనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతుబజార్‌లో భారత్ దాల్ విక్రయాలు

సాక్షి ఎఫెక్ట్..


భారత్ దాల్ విక్రయిస్తున్న ఈవో వరలక్ష్మి

ఏయూ క్యాంపస్: ప్రజలకు నిత్యావసరాలు అందుబాటులో ఉంచాలని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న భారత్ దాల్ విక్రయాలు బుధవారం పెదవాల్తేరు రైతుబజార్‌లో ప్రారంభించారు. ఈవో వరలక్ష్మి స్వయంగా విక్రయించారు. ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి శనగపప్పు కిలో రూ.60 చొప్పున విక్రయించారు. రైతు బజార్‌కి 2 వేల కిలోల శనగపప్పు వచ్చింది. వినియోగదారులు భారత్ దాల్‌ని రైతుబజార్ నుంచి నేరుగా రాయితీపై కొనుగోలు చేసుకోవచ్చు. ప్రజలకు పూర్తి స్థాయిలో భారత్ దాల్ చేరడం లేదని ఈ నెల 13న 'సాక్షి'లో ప్రచురితమైన ప్రజలకు చేరని 'భారత్ దాల్' కథనానికి అధికారులు స్పందించారు. ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించారు. బుధవారం దాదాపు 350 కేజీల వరకు భారత్ దాల్ విక్రయాలు జరిపారు.

24 నుంచి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలో శ్రీ గణేష్ సాయి షటిల్ అండ్ బ్యాడ్మింటన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు వేగి రమణ తెలిపారు. పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త వెంకోజీపాలెం వుడా కల్యాణ మండపం ఎదురుగా ఉన్న జీవీఎంసీ హరితవనం పార్కులో పోటీలు ప్రారంభమతాయన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు అసోసియేషన్ సభ్యులను గానీ లేదా 92467 48640 నంబరులో సంప్రదించాలన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు


మలేరియా ల్యాబ్ టెక్నీషియన్ నాగేశ్వరరావును సత్కరిస్తున్న జిల్లా మలేరియా అధికారి తులసి

మద్దిలపాలెం: జిల్లా మలేరియా కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న చెల్లుబోయిన నాగేశ్వరరావు 2024 సంవత్సరానికి గాను ఇండియా బుక్ రికార్డ్స్ లో స్థానం పొందారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. జిల్లా మలేరియా అధికారి తులసి మాట్లాడుతూ వృత్తిలో రాణిస్తూనే, ఆసక్తి గల క్రీడారంగంలో క్రీడాకారులను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ స్విమ్మింగ్, రన్నింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు జిల్లా నుంచి పదిమందిని పంపించడం ద్వారా ఈ గుర్తింపు లభించిందన్నారు. దీంతో ఇండియా బుక్ రికార్డ్స్ ప్రతినిధులు వర్చువల్‌గా అభినందించి సర్టిఫికెట్, మెడల్ అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు నగేష్ పటాన్నాయక్, నాగ శ్రీను, వెంకటేష్, శ్రీనివాసాచారి, సూపరింటెండెంట్ ఎర్రాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు అభినందన

ఎంవీపీకాలనీ: ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో విజేతలుగా నిలిచిన వీఎంసీ కళాశాల క్రీడాకారులను ఆ కళాశాల ప్రిన్సిపల్ తదితరులు అభినందించారు. ఇటీవల విశాఖ వేదికగా నిర్వహించిన పోటీల్లో కళాశాల విద్యార్థిని గ్రేసీ, పీడీ దుర్గ కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచారు. ప్రిన్సిపాల్ కాసు వారికి అభినందనలు తెలిపారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం


ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి, భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అర్చకులు శ్రీనివాస్ పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి పసుపు నీటితో జలాభిషేకం చేశారు. కొత్త చీర, పలు రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఛైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ట్రస్టు సభ్యులు, ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

'క్లబ్‌పై ఆరోపణల్లో వాస్తవం లేదు'


మాట్లాడుతున్న సెంచరీ క్లబ్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

బీచ్‌రోడ్డు: ఐబీపీ సెంచరీ క్లబ్ ఉత్తరాంధ్రుల ఆస్తి అని, దాత బాల సూర్య ప్రకాశరావు స్థాపించిన క్లబ్‌ను నిబంధనల ప్రకారం కొనసాగిస్తున్నామని, క్లబ్‌పై వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని క్లబ్ అధ్యక్షుడు వై.దుర్గా ప్రసాద్, ప్రతినిధి దిలీప్ కుమార్ తెలిపారు. బుధవారం క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. తమ క్లబ్ నుంచి సస్పెండ్ అయిన సభ్యుడు కె.శివాజీ చేస్తున్న ఆరోపణలు నిజం కాదన్నారు. కక్షపూరితమైన ఉద్దేశంతోనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ అనుమతితోనే క్లబ్‌లో బార్, పేకాట నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 1200 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి జవహర్ లాల్, ఉపాధ్యక్షుడు వెంకట్ రాజు తదితరులు పాల్గొన్నారు..


పండగల వేళ మొక్కలు నాటుదాం

- డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ పిలుపు


ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్‌తో కలిసి మొక్క నాటి నీరు పోస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: సామూహిక మొక్కల పెంపకం ద్వారా డివిజన్ పరిధిలో జరిగే అన్ని ఉత్సవాలు, పండగలను జరుపుకుందామని డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) సౌరభ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. వసంత పంచమి సందర్భంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో బుధవారం పలు రైల్వే కాలనీలు, పార్కుల్లో సుందరీకరణలో భాగంగా పూల మొక్కలను డీఆర్‌ఎం చేతుల మీదుగా నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచేలా అవగాహన కల్పిస్తూ, ప్రోత్సాహపరిచేందుకు ఈకార్వో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు. ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ మొక్కలను పెంచడం, వాటిని బహుమతులుగా ఇచ్చి వేడుకలు చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, ఈకార్వో వైస్ ప్రెసిడెంట్ మధుస్మిత సాహూ, ఇతర అధికారులు, ఈకార్వో ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

పుల్వామా దాడిలో అమరులకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

బీచ్‌రోడ్డు: పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లకు బీజేపీ నాయకులు బీచ్‌రోడ్డులోని విక్టరీ ఎట్ సీ వద్ద గల అమరవీరుల స్థూపం వద్ద బుధవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నర్సింహారావు, నాయకులు ప్రకాష్ రెడ్డి, ధనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధకుల మెస్ పరిశీలన


మెస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధకుల మెస్‌ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ బుధవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో ఆకస్మికంగా మెస్ తనిఖీ చేసి పరిశోధకులతో మాట్లాడారు. భోజన నాణ్యత అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ పరిసరాలు, కిచెన్ పరిశీలించారు. హాస్టల్ మెస్‌లో సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. హాస్టల్ వార్డెన్లు, చీఫ్ వార్డెన్లు నిరంతరం విద్యార్థుల భోజన సదుపాయాలు పర్యవేక్షించాలని సూచించారు. ఆయనవెంట చీఫ్ వార్డెన్ ఆచార్య బి.మునిస్వామి, ఆచార్య జి.వీర్రాజు వున్నారు.

పాఠశాలలో వసంత పంచమి పూజలు


తోటగరువు ప్రాథమిక పాఠశాలలో పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి తోటగరువు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహాన్ని పువ్వులతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథం మాట్లాడుతూ వసంత పంచమి ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నజ్మ, రమేష్, రోజా, లక్ష్మణ్, షబానా, సుమ పాల్గొన్నారు.

పారిశ్రామిక సమ్మె జయప్రదానికి పిలుపు

సీతమ్మధార : నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏపీఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని నర్సింగరావు ప్రారంభించారు. జగదాంబ, లేపాక్షి, చౌత్రీ, పూర్ణామార్కెట్, కొత్తరోడ్డు మీదుగా సాగిన ర్యాలీ తిరిగి జీవీఎంసీ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు, కార్మికులకు నష్టదాయకమైన చట్టాలు చేసిందన్నారు. వ్యవసాయ రంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థల పరం చేయడానికి పూనుకుందన్నారు. 2024 ఎన్నికల్లో మోదీ తిరిగి అధికారంలోకి వస్తే వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు గత మూడేళ్లుగా ప్రజలు ఉద్యమం సాగిస్తుంటే దున్నపోతు మీద వర్షం కురిసినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. 16వ తేదీ పోరాటానికి ప్రజలు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అచ్యుతరావు, ఆర్‌ఎస్‌వీవీ కుమార్, కె.ఎం. శ్రీనివాసరావు, ఎం.మన్మథరావు, దేవా, పి.మణి, పడాల రమణ, రెహ్మాన్, వై.రాజు, వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభస్వామి క్షేత్రం అభివృద్ధికి కృషి

పద్మనాభం : పద్మనాభంలోని గిరిపై వెలసిన అనంత పద్మనాభ స్వామి క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. గిరిపై ఉన్న అనంత పద్మనాభుని ఆలయాన్ని బుధవారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం పద్మనాభం యుద్ధ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు నిలయమైన అనంత పద్మనాభుని క్షేత్రాన్ని ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతుని ఆలయ అభివృద్ధికి ప్రసాదం పథకం కింద నిదులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో 13 శిబిరాలు నిర్వహించి ఎంపిక చేసిన మూడు వేల మంది దివ్యాంగులకు రూ.2.50 కోట్ల విలువైన ఉప కరణాలు ఈ నెల 15న పోర్టు స్టేడియంలో కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం గోపాల్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తామన్నారు. అనంతరం పద్మనాభం యుద్ధంలో అసువులు బాసిన రెండో చిన విజయ రామరాజు సమాధి వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

మహారాణిపేట : మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా నివాళులర్పించారు. విశాఖ జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం సంజీవయ్య 103వ జయంతి జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, సీఈవో ఎం. పోలినాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా ఇటు రాష్ట్రానికి, అటు దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఆయన జీవిత చరిత్ర, విశేషాల గురించి వివరించారు. పేద కుటుంబంలో జన్మించిన సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా అతి చిన్న వయసులోనే అమూల్యమైన సేవలందించారన్నారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన ఆయన నిరాడంబరతకు మారుపేరుగా, నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచారన్నారు.

ఆయన బాటలో అందరూ పయనించి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాఘ పౌర్ణమి, శివరాత్రి విశిష్టతపై ప్రచారం


చిప్పాడలో ప్రచారం నిర్వహిస్తున్న విజయరాంపురం ప్రతినిధులు

తగరపువలస: త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుని శిష్యులు ఆయన రచనల్లోని మాఘపౌర్ణమి, శివరాత్రి విశిష్టతను బుధవారం భీమిలి మండలం పాత మూలకుద్దు, చిప్పాడ పంచాయతీలో ప్రచారం చేశారు. పూర్వం నిరాకార పరమాత్మకు గుర్తుగా గర్భగుడి లేని ఈశ్వర లింగంగా చూపించేవారని తెలిపారు. మాఘ పౌర్ణమి భగవంతుని జన్మను తెలియజేస్తుందన్నారు. ఈ మాసంలో సుగుణ, నిర్గుణ పూజల విశిష్టతను తెలుసుకోవాలన్నారు. ధర్మాధర్మ విచక్షణ తెలుసుకోవాలన్నారు. ప్రచార కార్యక్రమంలో విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు వి.సురేష్, బి.అంకమ్మ, రాజేశ్వరి, కె.రాజు, వి.భవాని, బంగారుతల్లి పాల్గొన్నారు.